# ఆముష్మికం

వయసు పెరుగుతున్నకొద్దీ సాంబమూర్తిలో ఆముష్మిక సంబంధమయిన ఆలోచనలు పెరుగుతూ వచ్చాయి. వయసులో వున్నప్పుడు చేసిన పాపకృత్యాలూ, చేసిన అవినీతి పనులూ పదే పదే గుర్తుకువచ్చి రకరకాల దేవుళ్లమీద భక్తిని బాగా పెంచేశాయి. అందువల్లనే అతడు అనుక్షణం దేవుడిని స్మరించటం అలవాటు చేసుకున్నాడు.

ఐహిక సుఖాలమీద వ్యామోహాన్నీ, భోగలాల సత్యాన్ని వదులుకొని పరలోక జీవితం గురించి అనుక్షణం ఆలోచించటం మొదలుపెట్టారు. ఇందు గురించి ఆయన ఇటీవలి కాలంలో చదివిన ఆధ్యాత్మిక, మత సంబంధమయిన కొన్ని పుస్తకాలు కూడా దోహదం చేశాయి. ఆ పుస్తకాలను కూడా ఆయన కొనలేదు. ఆయనలాగే రిటైరయిన ఒకరిద్దరు మిత్రులు చదువుకోమని ఉచితంగా ఇచ్చారు.

సాంబమూర్తి డబ్బుతో పుస్తకాలను కొనడు. అసలు కొనాలనే ఆలోచన వుండదు. అలా పుస్తకాలను కొనే డబ్బును కూడా కూడబెట్టడమే ఆయన ప్రధాన లక్ష్యం. అలా కూడబెట్టిన డబ్బునంతటినీ ఏం చెయ్యాలో ఆయన ఈమధ్యనే గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఒక స్థిర నిశ్చయానికి వచ్చి నిశ్చింతగా వున్నాడు.

ఇలా నిశ్చింతగా వుండటానికి ముఖ్యంగా ఆయన ఇద్దరు కొడుకులు కారణం అనుకోవచ్చు. సాంబమూర్తికి ఇద్దరు కొడుకులతో పాటు, ఇద్దరు కూతుళు కూడా వున్నారు. నలుగురికీ పెళ్లిళ్లు చేశాడు. ఆ నలుగురికీ పిల్లలు వున్నారు.

మొదట్లో తను సృష్టించిన పిల్లలందరినీ సమానంగానే ప్రేమించాడు గానీ మరణం తర్వాత జీవితం గురించిన ఆలోచనలు మొదలయిన తర్వాత కూతుళ్ల మీద కంటే కొడుకుల మీదనే ఎక్కువ ఇంట్రస్టు కనబరచడం మొదలుపెట్టాడు.

ఎందుకంటే, తనని పున్నామ నరకం నించి తప్పించేది, వైతరిణీ నదిని దాటించేది కొడుకులే గానీ కూతుర్లు కాదు అనే విషయాన్ని ఆయన బాగా నమ్మాడు. ఒక వైదిక కుటుంబంలో పుట్టి పెరిగిన సాంబమూర్తిలో ఈ నమ్మకం బలంగా నాటుకుపోయింది.

ఈ ఉద్దేశం మొదటినుంచీ వున్న కారణంగానే అయివుండవచ్చు – ఆయన కూతుళ్ల చదువును స్కూలు దశలోనే ఆపుచేశాడు. ఎంత చదివించినా ఎక్కువ కట్నం ఇచ్చి పెళ్లిళ్లు చెయ్యాలి. ఒకవేళ బాగా చదువుకుని ఆడపిల్లలు ఉద్యోగాలు చేసినా ఆ వచ్చే జీతాన్ని అల్లుడు, అల్లుడి తల్లిదండ్రులు అనుభవిస్తారు. తనకు

ఎటువంటి ప్రయోజనం వుండదు. అందువల్ల వాళ్ల చదువు గురించి తను ఖర్చుపెట్టటం దండగ. ఆ ఖర్చును కూడా కొడుకుల చదువుమీద పెడితే మరింత ప్రయోజకులవుతారు. ఇలా అనుకుని కొడుకులిద్దరినీ బాగా చదివించాడు. అనుకున్నట్టుగానే వాళ్లకు మంచి ఉద్యోగాలు సంపాదించిపెట్టాడు.

అంతవరకు ఆయన కోరిక నెరవేరింది.

అమ్మాయిలు పెద్దవాళ్లయిన కారణంగా వాళ్లకు ముందుగా పెళ్లిళ్లు జరిగి వాళ్లకు పిల్లలు పుట్టారు. అయినా సాంబమూర్తికి ఎటువంటి సంతోషమూ కలుగలేదు. ఎందుకంటే కూతుళ్లకు పుట్టిన పిల్లలకు తన ఇంటిపేరు రాదు. అల్లుడి ఇంటిపేరు వస్తుంది. కేవలం ఈ కారణంచేత ఆయన విచారపడ్డాడే గానీ సంతోషపడలేదు.

కానీ కూతుళ్లుమాత్రం తమ పిల్లలవల్ల తన తండ్రి ముందుగా తాత అయ్యాడు కాబట్టి తమ పిల్లలకు ఏవయినా బంగారు ఆభరణాలు కొనిపెడతాడని బారసాల రోజు ఆశతో ఎదురుచూశారు. కానీ వాళ్ల ఆశ ఫలించలేదు. వేరే ఇంటిపేరు పెట్టుకున్న పిల్లలకు తనెందుకు కొనిపెట్టాలి? అనే నిశ్చయంతో వున్న సాంబమూర్తి మౌనం వహించి కూర్చున్నాడు గానీ ఆడపిల్లల మనసును అర్థం చేసుకునే ప్రయత్నం మాత్రం చెయ్యలేదు. ఆయన దృష్టి అంతా కొడుకులు మీదనే. వాళ్లకు పుట్టబోయే సంతానం మీదనే.

నిజానికి సాంబమూర్తి పేదవాడు కాదు. బాగానే వున్నవాడు. ప్రభుత్వ ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని నీతినియమాలను గాలికి వదిలి చిన్న చిన్న అవకాశాలను వదలకుండా విపరీతంగా డబ్బును సంపాదించి అనేక విధాలుగా పెట్టుబడులు పెట్టాడు. స్థిరాస్తులను సంపాదించాడు. వెండి, బంగారం కొని వుంచాడు. రేపు ఈ ఆస్తినంతా కొడుకులు, కొడుకుల పిల్లలు అనుభవించాలి. తన వంశాన్ని వృద్ధిపరచాలి. ఇదీ ఆయన నిరంతర ఆలోచన.

అంతేగానీ కొడుకులను కన్నట్టే కూతుళ్లను కూడా కన్నాననీ, తన సంపదను అనుభవించే హక్కు వాళ్లకు కూడా వున్నదనే ఆలోచనను ఆయన ఎప్పుడూ రానివ్వడు, మొత్తం తన స్థిర, చరాస్తులన్నీ కొడుకులకే చెందాలి. వాళ్లే అనుభవించాలి.

ఇలాంటి సమయంలో పెద్దకొడుక్కి ఓ అబ్బాయి పుట్టాడు. ఆ వార్త విని సాంబమూర్తి చాలా ఎక్కువగా సంతోషించాడు. అప్పటికప్పుడే మనవడికి ఓ బంగారు గొలుసును చేయించాడు. అలా చేయించి, గొలుసును ఇంటికి తీసుకువచ్చిన రెండో రోజున సాంబమూర్తి పెద్దకూతురు చాముండేశ్వరి పుట్టింటికి వచ్చింది.

అప్పుడు అంతగా కుట్ర, తెలివితేటల్లేని సాంబమూర్తి భార్య జానకమ్మ కూతురికి మనవడికోసం చేయించిన ఆ గొలుసును చూపించి "ఎలా వుంది? బావుందా?" అని అడిగింది.

"ఇదేమిటి? ఇంత చిన్న గొలుసు చేయించుకున్నావ్" అని అడిగింది చాముండేశ్వరి.

"నాక్కాదే.... నీ పెద్ద తమ్ముడి కొడుక్కి.... పిల్లవాడికి.... నాలుగు రోజుల్లో బారసాల వుంది కదా.... మీ నాన్నగారు చేయించారు మనవడికి.... బాగుంది. బట్టలు కూడా చూపిస్తాను వుండు" అన్నది ఆమె.

అప్పుడు చాముండేశ్వరి మనసు బాగా గాయపడింది. తనకు మొదటిసారిగా కొడుకు పుడితే వాడికి కనీసం బట్టలు కూడా తీసుకోలేదు, కొడుక్కి కొడుకు పుట్టాడంటే అప్పుడే బంగారు గొలుసు, బట్టలు సిద్ధం చేశారు. తను వాడిలాంటిది కాదా.... వాడికంటే ముందు పుట్టింది కూడా....

ఇలా బాధపడింది కానీ తన ఫీలింగ్‌ను వాళ్ల ఎదుట కనబరచలేదు. తిరిగి తన వూరు వెళుతూ మధ్యలో తన చెల్లెలు వుంటున్న వూళ్లో దిగి ఈ బంగారు గొలుసు విషయాన్ని చెప్పింది. ఆ చెల్లెలు కూడా బాధపడింది కానీ ఏమీ చెయ్యలేక మంచితనాన్ని నిలుపుకుంటున్న దానిలా....

"పోన్లే.... రేపు వాళ్లు మంచానపడితే కొడుకు, కోడలు సేవలు చెయ్యాలి. ఆడపిల్లలు మనం చెయ్యం గదా.... అందువల్ల ఉన్నదంతాత వాళ్లకే వూడ్చిపెట్టటం న్యాయం కదా.... కష్టపడేవాళ్లే సుఖపడాలి.... ఇది లోక సహజం.... మనం బాధపడి ప్రయోజనం లేదు.... ఇక ఈ విషయంలో ఆలోచన అనవసరం" అన్నది.

ఇలా తన ప్రవర్తన కారణంగా కూతుళ్లు బాధపడతారని సాంబమూర్తి ఏమీ అనుకోలేదు. బాధపడితే పడనీ.... వాళ్లు బాధపడతారని తన ప్రయోజనాలని, ఇష్టాలని ఎందుకు వదులుకోవాలి?

కూతుళ్లవలన ప్రయోజనం ఏముంది? కొడుకులయితే తను పోయిన తర్వాత కర్మకాండలు జరుపుతారు. ఆ తర్వాత ప్రతి ఏటా శాస్త్రోక్తంగా తద్దినాలు పెడతారు. గారెలు వండిస్తారు. బ్రహ్మలకు పితృదేవతల పేరిట బట్టలు పెడతారు. తాను ముక్తి పొందటానికి బ్రహ్మలోకం చేరుకోటానికి దోహదపడతారు.

కానీ ఈ ఆడపిల్లలవల్ల ప్రయోజనం ఏముంది? తన తద్దినాలకు పిల్లలతో వచ్చి తిని వెళతారు. అంతకుమించి తను ముక్తి పొందటానికి ఎంతమాత్రం ఉ

పయోగపడరు. వీళ్లకు రూపాయి ఇచ్చినా దండగే - ఇది సాంబమూర్తి ఆలోచన.

సాంబమూర్తి ఇటువంటి ఆలోచనలో వుండగానే ఆయనకు వూహించని విధంగా ఆరోగ్యం పాడయ్యింది.... ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రిలో వుండగానే ఆయన దైవాన్ని స్మరిస్తూ ఈ లోకాన్ని విడిచాడు.

ఆ తర్వాత పనులన్నీ వరుసక్రమంలో జరిగిపోయాయి. బంధువుల సూచనల మేరకు సాంబమూర్తి భార్య కొడుకులచేత భర్త కర్మకాండలన్నింటినీ విధిగా జరిపించింది. తర్వాత బంధువుల సమక్షంలోనే కొడుకులిద్దరికీ స్థిరచరాస్తులను పంచి ఇచ్చింది.

కూతుళ్లకు మాత్రం కంటి తుడుపుగా తను కొన్నాళ్లు కట్టుకున్న జారీ చీరలను ఇచ్చింది. రెండో కూతురు వాటిని తీసుకోలేదు గానీ పెద్దకూతురు మాత్రం వీటిని మాత్రం ఎందుకు వదలాలన్నట్టు మూట గట్టుకుని వెళ్లింది.

ఆ తర్వాత కాలచక్రం గిర్రున తిరగలేదు గానీ మామూలుగానే ఎప్పటిలాగే తిరిగింది.

సాంబమూర్తి చనిపోయి రెండు సంవత్సరాలయ్యింది. ఆరోజు సాంబమూర్తి తద్దినం.

ఆ ముందురోజు సాయంత్రం పెద్దకొడుకు చలపతిరావు కాలేజీలో స్నేహితులిద్దరు వేరే వూర్నించి వచ్చారు. వాళ్లతో కలిసి చలపతిరావు కూడా ఆ రాత్రి హొటలు గదిలోనే వున్నాడు.

అతను వాళ్లతో బయటకు వెళ్లబోతున్నప్పుడు- "రేపు మీ నాన్న తద్దినం కదా.... ఆ ఏర్పాట్లు చూడకుండా వాళ్లతో బయటకు వెళుతున్నారేమిటి?" అని అడిగింది అతని భార్య.

చలపతిరావు అదోలా నవ్వి "కాలి బూడిదయిన మనిషికి తద్దినం ఏమిటి? సిల్లీగా వుంటుంది. అయినా ఇక్కడ నేను తద్దినం పెట్టి బ్రాహ్మలకు భోజనం పెడితే కాలి బూడిదయిన ఆయన కడుపు నిండుతుందా?" అని హేళనగా నవ్వి వెళ్లిపోయాడు.

ఆ మర్నాడు - అంటే తండ్రి సాంబమూర్తి తద్దినం రోజు చలపతిరావు ఇంటికి రాలేదు. స్నేహితులతో కలసి ఆ హొటలు గదిలో పేకాడుతూ, విస్కీ తాగుతూ కూర్చున్నాడు. ❖

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, సెప్టెంబర్ 2010*